# పదపదవే వయ్యారి గాలిపటమా.....

మల్లిక్

"నాన్నా" ఆరేళ్ళ బుజ్జికొండ మెల్లగా అడుగులేస్కుంటూ వచ్చి పిల్చాడు.

"ఏం నాన్నా?" చదువుతున్న పేపర్లోంచి తలెత్తకుండానే కొడుకుని ముద్దుగా అడిగాడు సీతారాం.

"మరేమో సంక్రాంతి వస్తోంది కదా ఉహు హు" అన్నాడు బుంగమూతిపెట్టి నేలకేసి కాళ్ళుకొడ్తూ.

"అలాగే.. అలాగే... అమ్మతోచెప్పి పండక్కి బోల్డన్ని అప్పచ్చులు వండిస్తాగా" అన్నాడు సీతారాం పేపర్లోంచి ఇంకా తలెత్తకుండానే.

అతని మాటలు వింటూనే పక్కగదిలోంచి అతని భార్య దుర్గా దేవి రయ్యిన వచ్చింది.

""మరేం వంటలక్కలా నేను తేరగా దొరికాను అనీ ఇవీ వండిపెట్టడానికి. నేనేం వండను మీరు వండుకోండి బొల్డన్ని అప్పచ్చలు!" అంది దుర్గాదేవి రుసరుసలాడ్తూ.

"వా" అంటూ రాగం ఎత్తుకుని హఠాత్తుగా నేలమీద పడి ఈ మూలనుండి. ఆ మూలకి, ఆ మూలనుండి ఈ మూలకి దొర్లసాగాడు బుజ్జికొండ.




సీతారాం కంగారుపడిపోయాడు.

బుజ్జికొండని కిందనుండి లేవనెత్తి "తప్పమ్మా అలా నేలమీద దొర్లకూడదు. అలాచేస్తే బట్టలు మాసిపోతాయ్ కదా... నీ బట్టలు మాసిపోతే మరి నెనే కదా ఉతకాలి! నీకు బోల్డన్ని అప్పచ్చులు నేనె వండిపెడ్తాగా! బుజ్జగిస్తూ అన్నాడు.

"నాకేం అప్పచ్చులు వద్దు నా..."

"మరేం కావాలి! కొత్త బట్టలా?"

"కాదు....వా....."

"మరేం కావాలో చెప్పు..." పళ్ళు బిగపట్టి విసుగ్గా అరిచాడు సీతారాం.

బుజ్జికొండ చటుక్కున ఏడుపాపి తండ్రివంక కోపంగా చూశాడు.


"అలా కోపంగా అరుస్తారేం? యేం... మళ్ళీ నేలమీద పడి దొర్లాలా?"

సీతారాం నాలుక్కొరుక్కుని నవ్వు తెప్పించుకుని నవ్వాడు.

“ఛీ... ఏంటి బాబూ మరీ అమ్మలా దుడుకుగా ఉంటావ్... అలా దొర్లకూడదమ్మా... మరి బట్టలుతకాలంటే నాకు కష్టం అవుతుంది కదా? హి.... నీకేం కావాలమ్మా? హిహి” అడిగాడు సీతారాం కొడుకు ముందు మోకాళ్ళమీద నిల్చుని.

“నాకు గాలిపటం కావాలి!” అన్నాడు బుజ్జికొండ తీవ్రంగా మొహం పెడ్తూ.

“తప్పమ్మా..... గాలిపటాలు మన్లాంటి వాళ్ళు ఎగరెయ్యకూడదు.... వొట్టి జులాయ్ వెధవలు ఎగరేస్తారు గాలిపటాలు తెల్సా?” అన్నాడు సీతారాం బుజ్జికొండ తల నిమురుతూ.




ఆ మాటలు వింటూనే దుర్గాదేవి కయ్‌మని మొగుడి మీద లేచింది.

“ఎవరండీ జూలాయ్ వెధవలు? మీరు మీ తమ్ముడు, మీ నాన్నా, మీ తాత... అంతా మీ వాళ్ళే జులాయ్‌లు... ఎప్పుడూ మా పుట్టింటి వాళ్లని ఆడిపోస్కోవడం తప్ప వేరె ం పనేం లేదా మీకు?”

“ఇప్పుడు మీ పుట్టింటి వాళ్ళను నేనె మన్నానే” ఆశ్చర్యంగా అడిగాడు సీతారాం.

“గాలిపటాలెగరేసే వాళ్ళు వొట్టి జులాయ్ వెధవలని అన్నారుగా పోయిన సంక్రాంతికి మా తమ్ముడు ఇక్కడికి వచ్చినప్పుడు గాలిపటా లెగరేశాడనేగా అలా అంటున్నారు?”

“హవ్వ? నేనా ఉద్దేశంతో అన్లేదే! సర్లె సర్లె.... అలా కోపంగా చూడకు. గాలిపటా లెగరేసే వాళ్ళు జులాయ్ వెధవలేం కాదులే. మీ తమ్ముడు గాలిపటాలెగరేశాడనే విషయం మర్చిపోయి అలా అన్నాను. హి...... అంతె హిహి.... ఇప్పుడు కావాలంటే నేను కూడా ఎగరేస్తాను.. మన బుజ్జికొండకి కూడా కొనిస్తాను.... అవును గానీ వి డేడీ?” అన్నాడు గదంతా కలియజూస్తూ.

ఆ గదిలో బుజ్జికొండలేదు.

“వాడెక్కడికెళ్తాడూ... పక్కగదిలో ఉండుంటాడు” అంది దుర్గాదేవి.

ఇద్దరూ పక్కగదిలోకి వెళ్లి చూశారు. బుజ్జికొండ అక్కడ కూడా లేడు.... ఇంతలో పక్కింటబ్బాయి పరుగెత్తుకుంటూ వచ్చాడు.

“అంకుల్...... అంకుల్..... మీ బుజ్జికొండ రోడ్డుమీద “వా....” అని ఏడుస్తూ దొర్లుకుంటూ వెళ్ళిపోతున్నాడు......”

అన్నాడు వగరుస్తూ.

సీతారాం లబ్బున మొత్తుకుంటూ వీధిలోకి పరుగుతీశాడు. అలా ఫర్లాంగు దూరం పరుగెత్తిన తరువాత అక్కడ బుజ్జికొండ వేగంగా దొర్లుకుంటూ పోవడం కన్పించింది.

సీతారాం బుజ్జికొండని పట్టుకుని నేలమీద నుండి లేపు నిలబెట్టి బట్టలకంటిన దుమ్ము దులిపి "నీకు గాలిపటం నేనిస్తాగా,...... వూర్కోమ్మా వూర్కో.... అని నచ్చజెప్పి ఇంటికి తీస్కెళ్ళాడు.

"పొద్దున్నే బాబునెంత కష్టపెట్టారో! పాపం వాడు అన్నం కూడా తినలేదు వెధవ..." అంది దుర్గాదేవి బుజ్జికొండ తల నిముర్తూ.

"ఒరేయ్ కొండా..... నువ్వు అన్నం తినరా.... నేనేమో నీకు గాలిపటం ఇస్తా" అన్నాడు సీతారాం.

అన్నం తినడానికి బుజ్జికొండ దుర్గాదేవితోబాటు లోపలికి వెళ్ళాడు.

ఈలోగా సీతారాం ఓ పాతన్యూస్ పేపరొకటి, చీపురు పుల్లలు రెండు, కాస్త జిగురు

తీస్కునీ గాలిపటం తయారుచేశాడు.




బుజ్జికొండ అన్నం తినేసి చొక్కా ఎత్తి మూతి తుడ్చుకుంటూ లోపల్నుండి వచ్చాడు.

"రా నాన్నా.... రా?" అంటూ బుజ్జికొండని అక్కున చేర్చుకుని ప్రేమగా వీపునిముర్తూ "చూశావా నీకోసం ఎంచక్కని గాలిపటం తయారుచేశానో.!" అన్నాదు న్యూస్ పేపరు గాలిపటాన్ని చూపిస్తూ.

దాన్ని చూస్తూనే బుజ్జికొండ ఘొల్లుమన్నాడు.

చెంగున నేల మీదికి దూకి కాళ్ళు ఫటఫట నెలకేసి కొట్టి తరువాత కింద కూర్చుని కాళ్లు రెండూ ఒకదాని తరువాత మరొకటి మడిచి చాపుతూ మడిచి చాపుతూ నేలమీద సరసర రాచాడు.

ఈ హడావిడికి దుర్గాదేవి లోపల్నుండి పరుగెత్తుకు వచ్చింది.

"ఏంట్రా కొండా? నాన్న గాలిపటంలేదని అన్నారా?" అని అడిగింది.

బుజ్జికొండ కాళ్ళు నేలకేసి రాయడం ఆపి న్యూస్ పేపర్ గాలిపటాన్ని చూపించి మళ్ళీ ఘొల్లుమన్నాడు.

“మీ సిగరెట్లకీ షికార్లకీ బాగానే తగలేస్తారుగానీ పిల్లాడి గాలిపటం దగ్గరికి వచ్చేసరికి పొదుపు గురించి గుర్తుకు వస్తుందా?.... త్వరగా వాడిని పట్టుకోండి దొర్లుకుంటూ వెళ్ళిపోతున్నాడు?” అంది దుర్గాదేవి చిరచిర్లాడుతూ.

సీతారాం జుట్టు పీక్కుని వీధిలోకి పరుగెత్తి బుజ్జికొండని పట్టుకున్నాడు.

“పదరా వెధవా... షాపుకెళ్ళి గాలిపటం కొనుక్కుందాం........” అన్నాడు సీతారాం పళ్ళునూరుతూ.

“అలా కోపంగా అంటే నేను రోడ్డుమీద దొర్లుతానంతే” అన్నాడు బుంగమూతి పెట్టి బుజ్జికొండ.

‘సర్లె... అలా అనన్లే పద” అని మనసులోనే పళ్లునూరి గాలి పటాలు అమ్మే షాపుకి బుజ్జికొండని తీస్కెళ్ళాడు సీతారాం.

“మంచి గాలిపటాలు చూపించవోయ్” అన్నాడు సీతారాం షాపువాడితో. షాపువాడు సీతారాం వంక, బుజ్జికొండ వంక మార్చి మార్చి చూసి సీతారాంని అభినందన పూర్వకంగా చూశాడు.

“మీరు మహాత్ములు సార్... పేదల పాలిట పెన్నిధి సార్ మీరు!....” అన్నాడు అర్ధనిమీలిత నేత్రాలతో చేతులు జోడించి.

సీతారాం కంగారుగా వెనక్కి తిరిగి చూశాడు. “మీతోనే సార్ నేనంటుంది”

“నేనా?... ఎందుకూ?” తెల్లబోయి చూస్తూ అడిగాడు సీతారాం

“ఎందుకేమిటి సార్.. మీకు బీదా, గొప్పా తారతమ్యం లేదు సార్... ఒక అడుక్కునే బాలుడి సర్దా గ్రహించి ఆ అబ్బాయి సర్దా తీర్చడం కోసం మీ వెంట తీస్కొచ్చారంటే నిజంగా మీరు గ్రేట్. సార్..... అన్నాడు బుజ్జికొండ వంక చూస్తూ షాపువాడు. సీతారాం సిగ్గుపడ్డాడు.

హబ్బే... వాడు అడుక్కునే వాడి కొడుకు కాదు... మా వాడే... ఇందాకట్నుంచీ గాలిపటం కోసం రోడ్డుమీద పొర్లి పొర్లి అలా తయారయ్యాడు....” అన్నాడు. షాపువాడు అటు తిరిగి నాలుక్కొరుకున్నాడు.

“మరి మాకు మంచి గాలిపటాలు చూపిస్తావా?” అన్నాడు సీతారాం సిగ్గుతో చితికిపోతూ.


“ఇది తీస్కోండి సార్... బాగుంటుంది..” అన్నాడు షాపువాడు పెద్ద గాలిపటం చూపిస్తూ.

“హబ్బే... ఇంత చిన్నపిల్లాడికి అంత పెద్ద గాలిపటం ఎందుకోయ్... డబ్బు దండగ! కాస్త చిన్నది ఇవ్వు....” అన్నాడు సీతారాం.

“సార్..... మీ బాబు నేలమిద దొర్లుకుంటూ పోతున్నాడు” ఆశ్చర్యంగా చూస్తూ కంగారుగా అన్నాడు షాపువాడు.

“బాబూ.... వాడికి పెద్ద గాలిపటమే కావాలంట!... అదే ఇచ్చేసేయ్.......” అంతకంటే కంగారుగా అని సీతారాం పరుగెత్తుకు వెళ్లి బుజ్జికొండని పట్టుకున్నాడు.

ఇద్దరూ గాలిపటం తీస్కుని ఇంటికి వెళ్ళారు. సీతారాం గాలిపటానికి మాత్రం కట్టి బుజ్జికొండకి ఇచ్చాడు. బుజ్జికొండ దాన్ని ఎగరేస్తుంటే అది పైకి ఎగరకుండా గాల్లో రివ్వురివ్వుమని గుండ్రంగా అయిదారు రౌండ్లు తిరిగి ఠకీమని నేలకి కొట్టుకుని చిరిగిపోయింది.




దాంతో బుజ్జికొండ మళ్ళీ నేలమీద దొర్లడం మొదలుబెడ్తే సీతారాం నెత్తి కొట్టుకుని షాపుకెళ్ళి మరో గాలిపటం తెచ్చాడు. ఈసారి పైకి బాగానె ఎగిరిందిగానీ ఓ చెట్టుకొమ్మల్లో ఇరుక్కుపోయింది.

సీతారాం మరోసారి గాలిపటాల షాపుకు వెళ్ళక తప్పలేదు.

ఓసారైతే బుజ్జికొండ గాలిఓపటాన్ని బాగానే ఎగరెయ్యసాగాడు సీతారాం తృప్తిగా వూపిరి పీల్చుకున్నాడు గానీ అ తృప్తి ఎంతసేపో ఉండలేదు. బుజ్జికొండ ఎగరేస్తున్న గాలిపటం దారం దారికి స్కూటర్ మీదపోయే ఒకాయన గొంతుకు చుట్టుకుని రోడ్డుమీద ఢామ్మని పడిపోయాడు. అతనికి బాగా దెబ్బలు తగిలాయ్.

అతనికి ఆసుపత్రి ఖర్చులూ, స్కూటర్ రిపేర్‌కీ కలిపి మూడు వందల రూపాయలు ఇవ్వాల్సి వచ్చింది సీతారాంకి.

ఆ రోజే కాదు.. రోజూ గాలిపటాల వల్ల సీతారాంకి మనసుకి, శరీరానికి విశ్రాంతి ఉండడం లేదు. అంతేకాదు...... ఇంటికొచ్చిన ప్రతి వాళ్ళనీ "అంకుల్... గాలిపటం కొనుక్కుంటాను... డబ్బులివ్వరా?" అని బుజ్జికొండ అడుగుతున్నాడు. వాళ్ళు వెంటనే ఇవ్వకపోతే రోడ్డుమీద దొర్లుకుంటూ పోతాడు.

అంచేత సీతారాం ప్రస్తుతం రోడ్లవెంట మనశ్శాంతి లేక పిచ్చివాడిలా తిరుగుతున్నాడు.

ఈ గాలిపటాల సీజను అయ్యేదాకా అతని పరిస్థితి అంతే పాపం!